క్లుప్తంగా

కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న కేవీ విద్యార్థులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలో జాతీయ రహదారి పక్కన గల కేంద్రీయ విద్యాలయ వాల్తేర్‌లో గురువారం నా మట్టి.. నా దేశం అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 6వ తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో అర్హత సాధించిన వారు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ప్రాంతీయ, జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధిస్తారని కేవీ వాల్తేర్ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ తెలిపారు. అనంతరం నిషా అవగాహన వారోత్సవాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం ఉపాధ్యాయుడు ఎల్.రాంబాబు పర్యవేక్షించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధి కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అరుంధతి నగర్, అప్పర్ జయప్రకాష్‌నగర్, బాబూజీ నగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, కొత్తూరు, ఇందిరానగర్ 1–5 ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: కంచరపాలెం అశోక్‌నగర్‌లోని ఆంధ్ర బౌద్ధ సమాజ కేంద్రంలో ఈ నెల 10 నుంచి మహిళలకు టైలరింగ్‌లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సమాజ ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల మహిళలు, యువతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 96760 30455 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

పంచముఖ గణపతికి గరిక పూజ



పంచముఖ ఆంజనేయ గణపతి

అల్లిపురం: నీలమ్మవేపచెట్టు రోడ్డులో గత నెల 18వ తేదీ నుంచి శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పంచముఖ ఆంజనేయ గణపతికి గరికి పూజ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు భీశెట్టి గోపికృష్ణ, ఆకుల రాజు, తారకేష్, లక్ష్మణ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నిరసన

సీతంపేట: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో ఆ పార్టీ 25వ వార్డు అధ్యక్షుడు నమ్మి రవి ఆధ్వర్యంలో గురువారం సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద జైలు సంకెళ్లతో వినూత్నంగా నిరసన ప్రదర్శించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జనసేన ఉత్తర సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్, పార్టీ నాయకులు లొడగల కృష్ణ, సనపల వరప్రసాద్, విజయబాబు, ఇసరపు వాసు, పలు వార్డు అధ్యక్షులు, స్థానిక నాయకులు పాల్గొని నిరసన తెలిపారు.

తప్పుడు ఆరోపణలు తిప్పికొట్టండి

- గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ నాయకులు ప్రజలతో మమేకం కండి
- జేసీఎస్ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, కె.కె.రాజు తదితరులు

మర్రిపాలెం: ప్రజలతో మమేకమై ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలని పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 51వ వార్డు మాధవ స్వామి కల్యాణ మండపంలో గురువారం జేసీఎస్(మండలం–4) 48, 49, 50 వార్డులకు సంబంధించి నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు అధికారంలోకి రావాలి అన్న విషయంపై ప్రజలకు వివరించాలన్నారు. నాలుగున్నరేళ్లుగా వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి చెప్పాల్సిన అవసరం అందిరిపైనా ఉందన్నారు. ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లను వెనకుండి నడిపిస్తున్న పచ్చ మీడియాపై పోరాడాలని పిలుపునిచ్చారు. పచ్చ మీడియా చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దని ఇంటింటికీ వెళ్లి వాస్తవాలను తెలియజేయాలన్నారు. సీఎం జగన్ ఒక విజన్‌తో పనిచేస్తున్నారని, ముఖ్యంగా పేదలకు ఉచిత విద్య, ఆరోగ్యం, నిరుద్యోగులకు ఉపాధి, వృద్ధులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పార్టీ శ్రేణులతోపాటు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని, పేదలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, వైద్యం, మందుల పంపిణీ హర్షణీయమన్నారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

ప్రజలంతా గర్వపడేలా సీఎం పరిపాలన

కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలందరూ సంతోషించేలా, గర్వపడేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని, ప్రతి పనిలో నాణ్యత ఉండాలన్నదే సీఎం ఉద్దేశమని పేర్కొన్నారు. ఎంతసేపు ఏదో విధంగా విభేదాలు సృష్టించాలని ప్రతిపక్ష నాయకులు చూస్తున్నారని మండిపడ్డారు. మన పిల్లల భవిష్యత్తు బంగారుబాట పట్టాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర నియోజకర్గ ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామారావు, రాష్ట్ర కార్యదర్శులు చొక్కాకుల వెంకటరావు, రొంగలి జగన్నాథం, జిల్లా ఉపాధ్యక్షురాలు పీలా ఉమారాణి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్, స్టాండింగ్ కమిటీ మెంబర్లు చల్లా రజిని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, రాష్ట్ర నాయకులు కిరణ్‌రాజు, పేడాడ రమణికుమారి, భరణికాన రామారావు, మండల ఇన్‌చార్జులు పైడి కృష్ణారావు మాస్టర్, అమర్‌రెడ్డి, వసంతల అప్పారావు, వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, గుజ్జు వెంకటరెడ్డి, సునీత, రాష్ట్ర పార్లమెంట్, నగర నాయకులు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ సాయి

కంచరపాలెం: నేరాల నియంత్రణపై గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం కళా ప్రాంగణంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, దొంగతనాల నియంత్రణపై కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సాయి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గ్రామంలో దుకాణాలు అపార్ట్‌మెంట్లు, దేవాలయాలు, చర్చిలు సంఘాల భవనాలకు కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు మాట్లాడుతూ ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. బీఆర్‌టీఎస్ రహదారిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆదారి శ్రీనివాసరావు, గ్రామాభ్యుదయ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉందని ఫిర్యాదు

మర్రిపాలెం: తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఓ యువతి కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడలో కొత్తకోట లావణ్య అనే యువతి తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తోంది. అదే ప్రాంతంలో నివసిస్తున్న ఆమె కుటుంబ సభ్యులైన చిన్నాన్న హరి, అతడి భార్య, పిల్లలు లావణ్య కుటుంబం గురించి బయట అసభ్యకరంగా మాట్లాడటం చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 1న లావణ్య తల్లిదండ్రులను, యువతిని దుర్భాషలాడటం, కొట్టడం చేశారు. దీంతో ఆమె తమకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

నిరాశ్రయులకు చేయూత



నిరాశ్రయులకు ఆహారం అందిస్తున్న ఎస్‌ఐ రవికిషోర్

మర్రిపాలెం: ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా ఏయూటీడీ సంస్థ ఆధ్వర్యంలో అండర్ ది స్టార్స్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం దరి బీఆర్‌టీఎస్ బస్టాప్ వద్ద గురువారం రాత్రి కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ ఎస్‌ఐ రవికిషోర్ నిరాశ్రయులకు ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూటీడీ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఒక రోజు నిరాశ్రయులు పడుతున్న బాధలు తెలుసుకుని ప్రపంచానికి తెలియజేయడం హర్షనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని చెప్పారు.

వాకర్స్ క్లబ్ సమావేశం రేపు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ నెలవారీ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. ఆరోజు సాయంత్రం 6 గంటలకు జరిగే సమావేశంలో ఈ నెలలో నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాల ప్రణాళికపై చర్చించడంతోపాటు బంగారు నంది గ్రహీత రంగస్థల కళాకారుడు, దుర్యోధన పాత్రధారుడు బగాతి విజయసారథి ముఖ్య అతిథిగా, డిస్ట్రిక్ట్–101 ఎలెక్ట్ గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కె.ద్వారకానాథ్, అతిథిలుగా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ మాసపత్రిక ఆవిష్కరిస్తామని చెప్పారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



సిరులతల్లి సన్నిధిలో భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవలో 22 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు మీసాల అశోక్‌కుమార్, బి.అనురాధ, ఎస్.సతీష్, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్.సురేష్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

లలితా పీఠంలో నేడు హోమాలు

సీతంపేట: బహుళ అష్టమి సందర్భంగా అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి చండీ హోమం, సాయంత్రం 7 గంటలకు కాళీ కాలభైరవ హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యార్థినులకు ధ్రువపత్రాల అందజేత



సర్టిఫికెట్లు అందుకున్న వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన విద్యార్థినులు

దాబాగార్డెన్స్: ఏపీఎస్ఎస్‌డీసీ, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యూటీషియన్, ఎంఎస్ ఆఫీస్, జావా ఫుల్ స్టేక్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి అభినందించారు. 133 మంది విద్యార్థినులు ఆయా కోర్సుల్లో శిక్షణ పొందారు. కార్యక్రమంలో జేకేసీ కో ఆర్డినేటర్ డి అరుణపద్మ, స్కిల్ కాలేజ్ కో ఆర్డినేటర్ డాక్టర్ హైమావతి, ఏపీఎస్ఎస్‌డీసీ కో ఆర్డినేటర్ కె ప్రశాంతి పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

గోతులతో ఇబ్బందులు



బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రధాన రహదారిలో గోతులు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్ నుంచి సాయిబాబా దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారిలో గోతులతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో రాత్రి పూట ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.

– జి.రాజేష్, బాలయ్యశాస్త్రి లేఅవుట్

అవినీతి రహిత సమాజానికి కృషి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ జయ

మద్దిలపాలెం: అవినీతి రహిత సమాజానికి విద్యార్థులు కృషి చేయాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ కోరారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా గురువారం కళాశాలలో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవినీతి ఎండకడతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జయ మాట్లాడుతూ ఏ రంగంలో అవినీతి జరుగుతున్నా బయట పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఉమామహేశ్వరరావు, డెమిట్ రాజ్, ప్రతాప్, లక్ష్మి పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రోషా

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం కళాశాల హెల్త్ కమిటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ నెలను బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తారన్నారు. ఎక్కువ శాతం మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. డాక్టర్ హోమిబాబా క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రివెంటివ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ రోషా బ్రెస్ట్ క్యాన్సర్ రావడానికి కారకాలు, రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ జె.లావణ్య, హెల్త్‌క్లబ్ ఇన్‌చార్జ్ ఎ.జ్యోతి, మైక్రోబయాలజీ అధ్యాపకురాలు డాక్టర్ టి.వరలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య సురక్ష’ వైద్య శిబిరం నేడు



ఎన్జీజీవోస్ కాలనీ పాఠశాల ఆవరణలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏఎంవోహెచ్ డాక్టర్ రాజేష్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. గైనకాలజిస్ట్, పీడియాట్రీషియన్, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చే వారికి వైద్యులు అవసరమైన పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

జీవీఎంసీ జోన్–3 సహాయ వైద్యాధికారి డాక్టర్ రాజేష్ వైద్య శిబిరం కోసం పాఠశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్, కేస్ షీట్ కౌంటర్లను పరిశీలించారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులు నిరీక్షించే వెయిటింగ్ హాల్‌లో సదుపాయాలు, ఫార్మసీలో సిద్ధం చేసిన మందులు, వైద్య పరీక్షల ఏర్పాట్లు పరిశీలించి హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ అడ్మిన్లు, కార్యదర్శులకు పలు సూచనలిచ్చారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- నగరంలో 15 కూడళ్ల గుర్తింపు
- ప్రత్యేక బందాలతో ట్రాఫిక్ పర్యవేక్షణ
- డీసీపీ–1 శ్రీనివాసరావు



ద్వారకా పోలీస్ స్టేషన్‌లో డీసీపీ–1 శ్రీనివాసరావు

సీతమ్మధార: నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ–1 శ్రీనివాసరావు తెలిపారు. ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మహా విశాఖలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని 15 ప్రధాన కూడళ్లు మద్దిలపాలెం, హనుమంతువాక, సిరిపురం, గాజువాక, ఎన్ఏడీ, గోపాలపట్నం, కొమ్మాది, గురుద్వారా, పెందుర్తితోపాటు పలు ప్రాంతాలను గుర్తించామన్నారు. ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ రెగ్యులేషన్ కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు 15 జంక్షన్ల వద్ద ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్, క్రైం, రిజర్వ్ పోలీసులు పర్యవేక్షిస్తారన్నారు. ఫ్రీ లెఫ్ట్ ఉపయోగించకుండా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న వారు, బస్ బేల వద్ద ఆటోలు నిలిపివేస్తున్న వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు చేపడతామన్నారు. నగర ప్రజలు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

నగరంలోని రౌడీషీటర్లపై, గంజాయి తరలింపు కేసులపై ప్రత్యేక నిఘా పెట్టామని డీసీపీ–1 శ్రీనివాసరావు తెలిపారు. పాత కేసుల్లో ఉన్న వారి వివరాలు సేకరించామని, వారి రోజు వారి విధానాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగరంలో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. డీసీపీ శ్రీనివాసరావుతోపాటు ద్వారకా ఏసీపీ మూర్తి, ద్వారకా ఇన్‌చార్జి సీఐ భాస్కరరావు, ఎస్‌ఐ అప్పలరాజు తదితరులు ఉన్నారు.

ప్రజా శ్రేయస్సే సీఎం లక్ష్యం



సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు, రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: ప్రతి క్షణం ప్రజా శ్రేయస్సు కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 51వ వార్డులోని 289 సచివాలయం పరిధి కళింగనగర్ ఆయా ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించారు. వారి సమస్యలను తెలుసుకుంటూ పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు మురికివాడలు, కొండవాలు ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సచివాలయ వ్యవస్థ ద్వారా మురికివాడల్లోని లబ్ధిదారులకు అనేక సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్‌లు పైడి కృష్ణారావు మాస్టరు, అమర్ రెడ్డి, డైరెక్టర్లు పైడి శ్రీను, దిడ్డి రమేష్, వార్డు సీనియర్ నాయకులు దమయంతి, పొన్నాడ అప్పారావు మాస్టరు, శ్యామ్, వరలక్ష్మి, రత్నం, గణేష్, లక్ష్మణ్, సాధు, వినోద్, శ్రీను, సీనియర్ నాయకులు బోగవల్లి గోవింద్, షేక్ బాబ్జి, ఎం.సునీల్, కె.చిన్న, రాము, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గీత్ సంగీత్ విభావరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ తదితరులు

దాబాగార్డెన్స్: నగరానికి చెందిన సాంస్కృతిక సంస్థ గీత్ సంగీత్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్న సంగీత విభావరికి సబంధించి పోస్టర్‌ను గురువారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గీత్ సంగీత్ వ్యవస్థాపకుడు, మాజీ ఏడీసీపీ మహ్మద్ ఖాన్ నిర్వహణలో 3 గంటల నాన్‌స్టాప్ సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్టు చెప్పారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు కార్యక్రమంలో పాల్గొని హుషారైన తెలుగు, హిందీ గీతాలు ఆలపిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ భర్త గొలగాని శ్రీనివాసరావు, వీరేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా కథల పుస్తకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు అయ్యగారి సీతారత్నం రచించిన కూరాకులమడి కథల పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సమకాలీన, సాంఘిక సమస్యలపై అవగాహనతో ఆసక్తికరంగా, విజ్ఞాన దాయకంగా రాసిన కథల సంపుటిగా ఈ పుస్తకం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతో దేశాభివృద్ధి

ఏయూ క్యాంపస్: ఆరోగ్యవంతమైన సమాజంతో దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఏయూ వైద్యశాలలో ఉచిత ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఉద్యోగులు, విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకునే విధంగా ఆలోచన చేయాలని సూచించారు. అనంతరం ఆయన వైద్య శిబిరంలో వివిధ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో లీ హెల్త్ డొమైన్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎ.లీలారాణి, టి.రజిని కుమారి, టి.ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో విద్యార్థులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.